క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దకడబూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతను మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరై వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని కోరారు.

తిరుమల వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే సాయి



తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామివారిని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు.

వైఎస్సార్ కాలనీలో చోరీ

ఆదోనిరూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ మండిగిరి గ్రామంలో ఆదోని–ఆస్పరి రహదారిలోని వైఎస్సార్ కాలనీలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లల్లో చోరీకి యత్నించారు. చివరకు సూర్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో రూ.4 వేలు నగదు చోరీ చేసి ఉడాయించారు. మిగతా నాలుగు ఇళ్లల్లో ఏం దొరకకపోవడంతో దొంగలు వెళ్లిపోయి ఉంటారని బాధితులు పోలీసులకు తెలిపారు. బాధితుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్‌ఐ ఎర్రిస్వామి తెలిపారు. పోలీసులు తమ ప్రాంతంలో రాత్రివేళ గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటరు తుది జాబితా విడుదల



నియోజకవర్గ ఓటరు జాబితాను విడుదల చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: నియోజకవర్గ ఓటరు తుది జాబితాను విడుదల చేసినట్లు సబ్‌కలెక్టర్, ఆదోని ఎన్నికల అధికారి శివనారాయణశర్మ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పెషల్ సమ్మర్ రివిజన్–2024లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా వివరాలు వెల్లడించారు. రూరల్‌లో 97, అర్బన్‌లో 159 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,27,798 మంది పురుషులు, 1,29,682 స్త్రీ ఓటర్లు, ట్రాన్స్‌జెండర్స్ 49 మంది కలుపుకుని మొత్తం 2,57,529 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో నూతన ఓటర్లు 4,815, సర్వీస్ ఎలక్టర్ 110, ఫారం–6 ద్వారా 21,521, ఫారం–7 ద్వారా 16,359, ఫారం–8 ద్వారా సవరణలు చేపట్టినట్లు వివరించారు. జాబితాలో ఏదైనా సందేహాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏఈఆర్‌ఓ తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ రజనీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



ధణాపురంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ఆదోనిరూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం మండలంలోని ధణాపురం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు.

నరసింహయ్యకు నివాళి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదోనిరూరల్: మండలంలోని ధణాపురం గ్రామానికి చెందిన ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ నంబి నరసింహయ్య మొదటి వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి, స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ మాజీ సర్పంచ్ ఈరన్నగౌడ్, మహిళా సంఘం నాయకురాళ్లు సుజ్ఞానమ్మ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు గంగన్న, లక్ష్మన్న, ఉసేని, బాషా, జాన్ తదితరులు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. నరసింహయ్య ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



శోభాయాత్రలో పాల్గొన్న జయమనోజ్ రెడ్డి



నృత్యం చేస్తున్న గొరవయ్యలు



డ్రమ్స్ దరువుల మధ్య సాగుతున్న శోభాయాత్ర



ఆదోనిలో కాషాయ జెండాలతో బైక్ ర్యాలీ



సీతారామ లక్ష్మణ హనుమ వేషాధారణలో బాలికలు

అంతా రామమయం

- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన ఆదోని పట్టణం
- అయోధ్య రామ, ఆంజనేయ స్వామి కాషాయ జెండాలతో శోభాయాత్ర
- మహిళల కోలాటాలు, గొరవయ్యల నృత్యాలతో సందడి

ఆదోనిఅర్బన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శోభాయాత్ర జరిగింది. అయోధ్య రాముడు, ఆంజనేయస్వామి చిత్రాలతో కూడిన కాషాయ జెండాలతో పట్టణం నిండిపోయింది. జై శ్రీరామ్ నామస్మరణ మార్మోగింది. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రధాన రహదారులగుండా కోట్ల, పాత బస్టాండ్ కూడలి, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మీదుగా విక్టోరియాపేటలో వెలిసిన శ్రీరామ దేవాలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. చిన్నారులు, మహిళల కోలాటం, భక్తిభజనలతో ఆధ్యాత్మికత నెలకొంది. యువత జై శ్రీరామ్ అంటూ డీజే పాటలతో చిందులు తొక్కారు. గొరవయ్యలు నృత్యాలతో అలరించారు. సోమవారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిస్‌ప్లేలో అయోధ్యలో ప్రధాని నరేంద్రమోదీ ప్రాణప్రతిష్ఠలో పాల్గొన్న దృశ్యాలను తిలకించారు. యువనేత జయమనోజ్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, సభ్యులు హెగ్గటి ప్రతాప్, విట్టా రమేష్, మరియాని చెన్నబసప్ప, ఆంజనేయులు, వంశీ, శ్రీకాంత్‌రెడ్డి, రామాంజనేయులు, సోమశేఖర్, కునిగిరి నీలకంఠ, విజయ్‌కృష్ణ, శ్రీనివాస ఆచారి, శోభాయాత్రలో పాల్గొన్నారు.



వెండి ఆభరణాల అలంకారంలో మంగరాయ ఆంజనేయస్వామి



సంప్రదాయ వేషధారణలో కోలాటమాడుతున్న మహిళా భక్తులు

- పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే మంగరాయకాలనీలో వెలిసిన ఆంజనేయ స్వామిని వెండి ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు.
- పట్టణంలోని ఎల్‌బీ స్ట్రీట్‌లో వెలిసిన శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామి దేవాలయంలో బావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి పంచలోహ విగ్రహావిష్కరణతో పాటు ప్రత్యేక పూజలు జరిగాయి.



కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మంత్రాలయం : అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో ఊరువాడా రామనామ జపం పఠించింది. కాషాయవర్ణంతో పురవీధులు కనువిందు చేశాయి. ఈ నేపథ్యంలో మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి నేతృత్వంలో రాములోరి శోభాయాత్ర చేపట్టారు. ముందుగా స్థానిక యోగీంద్ర మంటపంలో శ్రీరామచంద్రుని మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల సమక్షంలో పుష్ప, పంచామృతాభిషేకాలు, నిర్వహించారు. రాములోరికి హారతులు పట్టి శోభాయాత్రకు అంకురార్పణ పలికారు. అశేష భక్తజనం మధ్య భజనలు, రామ కీర్తనలు, రామనామ మంత్రంతో యాత్ర కొనసాగింది. శ్రీమఠం నుంచి పాతూరు, రామచంద్రనగర్, రాఘవేంద్రపురం, మీదుగా శోభాయమానంగా యాత్ర గావించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఏఏఓ మాధవ శెట్టి శోభాయాత్రలో పాలుపంచుకున్నారు. స్థానిక ముస్లింలు సైతం యాత్రలో పాల్గొనడం విశేషం. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, మఠం మేనేజర్లు శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, నరసింహమూర్తి, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలో శ్రీరామ శోభాయాత్ర కనుల పండువగా సాగింది. సోమవారం అయోధ్యలో శ్రీ బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, మహామంగళ హారతులు పట్టారు అనంతరం ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై కొలువుంచి కలశాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాలతో కడపాళెం ఆంజనేయ స్వామి ఆలయం వరకు, అక్కడి నుంచి ప్రధాన రోడ్డు వెంబడి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. యాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కందుకూరు గ్రామం ఆలయంలో నూతన విగ్రహం ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు.

పెద్దకడబూరు: అయోధ్యలో రామ్‌లల్లా బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో సోమవారం రాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రామాలయం, తారాపురంలోని గిడ్డాంజనేయస్వామి దేవాలయంలో, బసలదొడ్డిలోని పైరయ్యస్వామి ఆలయంలో సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి, పట్టాభిషేకం గావించారు. మండల కేంద్రంలో సాయంత్రం స్థానిక రామాలయం నుంచి సీతారాముల ఉత్సవమూర్తులను ఉచ్చయంపై ఆసీనులు గావించి ఊరేగించారు.

కౌతాళం: మండల కేంద్రంలో శ్రీరాముడి శోభాయాత్రను సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించి శ్రీరాముడి చిత్ర పటాన్ని ఊరేగించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినాకర్, దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్ర రెడ్డి, బసప్ప, తిక్కయ్య, మాజీ ఎంపీటీసీ చౌదరి బసవ స్వామి యాత్రలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని బాపురం, రాజానగర్ క్యాంప్, నదిచాగిలో గురునాథ్ రెడ్డి, లింగన్న గౌడ, రామన్న గౌడల ఆధ్వర్యంలో రాములోరికి ప్రత్యేక పూజలు చేపట్టారు.



రథోత్సవం ముందు జై శ్రీరామ్ నామస్మరణ చేస్తున్న మహిళలు



రాములోరి ఊరేగింపులో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



మంత్రాలయంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగింపునకు తీసుకెళ్తున్న భక్తులు



శ్రీరాముడి చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

ఆదోనిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం 23వ వార్డు కేవీఆర్ కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వార్డు కౌన్సిలర్ గోవిందు, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు అశోక్, తాయన్న, భారతి, సందీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సన్ని, కార్యకర్తలు, నాయకులతో కలిసి గడప గడపను సందర్శించారు. సంక్షేమ పథకాలు, వార్డుల్లో వేసిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, బీటీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, కల్వర్టుల నిర్మాణం తదితర పనులను వివరించారు. ఆదోనిలో మునుపెన్నడూలేనివిధంగా అభివృద్ధి జరిగిందన్నారు. మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని, జగనన్నతోనే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. నాయకులు, కార్యకర్తలు వెంట ఉన్నారు.



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్ రెడ్డి

నేటి నుంచి ఎఫ్‌ఏ–3 పరీక్షలు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి ఫార్మెటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ–3) పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1 నుంచి 8 తరగతుల వారికి (సీబీఏ–2) క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలు, 9, 10 తరగతుల వారికి గతంలో మాదిరిగానే ఎఫ్ఏ–3 పరీక్షలు జరుగుతాయన్నారు. సీబీఏ పరీక్షలో డిస్క్రిప్టివ్, అబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయన్నారు. విద్యార్థులు గమనించి ప్రశ్నపత్రంలో టిక్ చేస్తూ ఓఎంఆర్ షీట్ నందు బబుల్ చేయాల్సి ఉంటుందని వివరించారు. 1 నుంచి 8వ తరగతికి మాత్రమే ఓఎంఆర్ షీట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ప్రభుత్వం జారీ చేసిన ప్రశ్న పత్రాలతో పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు ఉంటాయి. 1 నుంచి 5 తరగతుల వారికి 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. ప్రతి విద్యార్థి పరీక్షలు రాసే విధంగా చూడాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

బీమా తక్షణ సాయం అందజేత

కౌతాళం : స్థానిక సచివాలయం–2 పరిధిలో ఈనెల 13న మాల మూకప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్‌బీమాకు అర్హుడు కావడంతో ప్రభుత్వం బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు మంజూరైంది. సోమవారం వైఎస్సార్ సీపీ మండల నాయకులు దేశాయి ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినాకర్ పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు మృతుడి భార్య మాల అంబమ్మకు నగదు అందజేశారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

ఆదోనిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారం రోజుల్లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని

- ఆదోనికి చెందిన కె.ఈరన్న ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందడంతో ప్రభుత్వం సర్వే నంబర్ 594లో రెండెకరాల పొలం మంజూరు చేసింది. సదరు భూమికి సంబంధించి ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- గ్రామంలో రస్తా రోడ్డులో అక్రమంగా మరుగుదొడ్డి నిర్మించారు. రోడ్డుకు అడ్డుగా ఉందని, విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదోని మండలం నెట్టేకల్‌కు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం నెట్టేకల్‌లో రంగయ్య సర్వే నంబర్ 130/డీలో 1.47 ఎకరాల భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- కౌతాళం మండలం కామవరానికి చెందిన సురేష్ సర్వే నంబర్ 423/1లో 2.72 ఎకరాల భూమిని 1979 సంవత్సరం నుంచి సాగు చేసుకుంటున్నామని, ప్రస్తుతం సదరు భూమి ఆక్రమణకు గురైందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, ఆర్టీఓ శివారెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ శ్రీనివాసులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

కోసిగి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పల్లెపాడు సచివాలయ పరిధిలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలిసి పథకాల అమలుపై ఆరాతీశారు. అలాగే జగనన్న పాలనను టీడీపీ హయాంతో పోల్చి వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా మరోసారి జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నాగేశప్ప, హెచ్ఎం రామలింగప్ప ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాయకులు నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, షౌకత్ ఆలి, బుళ్లి నరసింహులు, హాజీ ఉస్మాన్, ఏఓ రాజు, ఎస్ఐ సతీష్‌కుమార్, ఏపీఓ జయరాం, ఏఈ వీరేష్, మల్లికార్జున గౌడ, దొడ్డి నరసన్న, నరసింహులు గౌడ, లంకా రెడ్డి, నరసయ్య, కోతి నరసింహులు, తిమ్మారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడండి

కోసిగి: మండలంలోని ఆర్లబండలో శ్రీ అంబ భవాని దేవి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25వ తేదీన రథోత్సవ మహోత్సవం నిర్వహిస్తామని, ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ మేటి గౌళ్లు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీరాములుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి రథోత్సవం రోజున మేటి గౌళ్ల కుటుంబాల నుంచి పూర్ణకుంభంతో వెళ్లి అమ్మవారికి పూజలు నిర్వహించి, అక్కడ నుంచి రథశాల వద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించేవారన్నారు. అయితే ఈ ఏడాది ఆలయ కమిటీ పెద్దలు, ఒక వర్గం వారితో కలిసి సంప్రదాయాలకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. అనాదిగా వస్తున్న ఆచారాలు కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు విక్టోరియాపేటలో సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణానికి యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. వార్డు కౌన్సిలర్ అంజినమ్మ, వార్డు ఇన్‌చార్జ్ భాస్కర్ పూజలు చేశారు. పనులను ప్రారంభించిన అనంతరం మనోజ్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. ప్రతి వార్డులో సుమారు రూ.కోటికి పైగానే నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గత టీడీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కొక్క వార్డులో రూ.10 లక్షలకు మించి పనులు జరిగేవి కావన్నారు. వైఎస్ జగనన్న పాలనలో ఒక్కొక్క వార్డులో కనీసం రూ.కోటి మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న వార్డు ఇన్‌చార్జ్ భాస్కర్

వాచ్‌మన్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోనిరూరల్: నకిలీ డీ పట్టాను సృష్టించి దౌర్జన్యం చేస్తున్న కోసిగి ఎస్సీ హాస్టల్ వాచ్‌మన్ హరిజన మల్లేశప్పపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్, దళిత ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు, తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతి పత్రాలను అందజేశారు. ఆయా సంఘాల నాయకులు రాజా రమేష్, గుంటెప్ప, ఆనంద్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక హద్దులు చూపాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఆదోనిరూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో దళితుల శ్మశాన స్థలానికి హద్దులు చూపించాలని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప, గ్రామాధ్యక్షులు పరమేష్, మదిరె వీరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆదోనిలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలని ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే 70 సెంట్ల దాకా ప్రభుత్వ భూమిని శ్మశానం కోసం కేటాయించారని, హద్దులు చూపించడంలో ఆదోని తహసీల్దార్, మండల సర్వేయర్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సబ్‌కలెక్టర్ స్పందిస్తూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షులు లక్ష్మన్న, నాయకులు మహారాజు, ఈరన్న, చంద్ర, ఏలియా తదితరులు పాల్గొన్నారు.